క్లుప్తంగా

రైతులకు శాశ్వత భూ హక్కు



పాస్ పుస్తకం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: రైతులకు, స్థిరాస్తుల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భూ హక్కు కార్డులు ఇవ్వడం సంతోషించదగిన విషయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను మండలంలోని తాళ్లపూడి సచివాలయంలో శుక్రవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. మొత్తం 710 పాస్ పుస్తకాలు మంజూరయ్యాయని, క్రమంగా వాటిని రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్లంపాటి గోపాల్, సచివాలయ కన్వీనర్ దువ్వూరు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలంలో మంత్రి కాకాణి పర్యటన నేడు

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం వెంకటాచలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మండల వెంకటశేషయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన ఎస్టీ లబ్ధిదారులకు ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో రూ.15 వేల ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

సీఐకు సన్మానం

కోవూరు: కోవూరులో ఎస్సైగా పనిచేసి సీఐగా పదోన్నతి పొందిన దాసరి వెంకటేశ్వరరావును డీసీఎంఎస్ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి అభినందించారు. శుక్రవారం కోవూరులో ఆయన్ను కలిసి సన్మానించారు. మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై దౌర్జన్యం కేసులో నిందితుల అరెస్ట్

తోటపల్లిగూడూరు: మండలంలోని ముంగళదొరువు పంచాయతీ మాజీ సర్పంచ్ కోనేటి గోవిందమ్మపై దౌర్జన్యం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై జంపాని కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈనెల 13వ తేదీన రాత్రి గోవిందమ్మ తన భర్త కోనేటి బాబయ్యతో కలిసి ముంగళదొరువులోని ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన ఇరగరాజు మదన్, బండ్ల మల్లికార్జున్‌లు ఆమెపై దౌర్జన్యానికి దిగారు. తిడుతూ, గోవిందమ్మ, బాబయ్యపై దాడికి యత్నించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈనెల 14వ తేదీన కేసు నమోదు చేశారు. నిందితులిద్దరినీ శుక్రవారం అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వడం జరిగిందని ఎస్సై వెల్లడించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

వెంకటాచలం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సీఐ కె.రామకృష్ణారెడ్డి సూచించారు. వెంకటాచలంలోని సచివాలయం వద్ద శుక్రవారం పొదుపు గ్రూపు మహిళలతో సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన సీఐ మాట్లాడుతూ పొదుపు గ్రూపు మహిళలు తాము తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని తిరిగి బ్యాంక్‌లకు సకాలంలో చెల్లించాలన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సమావేశంలో ఎంపీపీ మందా కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మండల వెంకటశేషయ్య, ఐకేపీ ఏపీఎం అనిల తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసింది టీడీపీనే..



మాట్లాడుతున్న నాయకులు

తోటపల్లిగూడూరు: దళితులను టీడీపీ ఎంతగానో మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడు ఈదూరు వెంకటరమణయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరిగిపోతోందంటూ కొందరు టీడీపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దళితుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. వారికి అనేక పదవులు ఇచ్చినట్లు తెలిపారు. టీడీపీ దళిత నాయకులు ఈ వాస్తవాలు తెలుసుకుని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ, సీఎం, రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు టీడీపీ కుయుక్తులు పన్నుతుందనే విషయం అందరికీ తెలుసన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు రాయపు శీనయ్య, బల్లి శేఖర్, నాయకులు తాని తిరుపతి, ఫాకం ప్రవీణ్‌కుమార్, ముసలి పరంధామయ్య, మూగ ధనంజయ, విడవలూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు వెళ్లి.. భరోసా కల్పించి..

- కోవూరు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి
- ప్రజల దీవెనలతో విజయవంతం
- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవూరు: కోవూరు మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయింది. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడి భరోసా కల్పించారు. శుక్రవారం కోవూరు సచివాలయం–1 పరిధిలో ప్రసన్న పర్యటించి ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.170.28 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. మొత్తం 24,411 గడపలు పూర్తి చేశామన్నారు. భగవంతుని ఆశీస్సులు, ప్రజల దీవెనలతోనే కార్యక్రమం విజయవంతమైనట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 80 సచివాలయాల పరిధిలో 94,327 గడపలు పూర్తి చేశామన్నారు. కోవూరు మండలంలోని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, సైడు డ్రెయిన్ల నిర్మాణానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పు రూ.3.20 కోట్లు విడుదల చేశారన్నారు. ఆ నిధులతో ఇప్పటికే కొన్ని పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి అందుతున్నాయన్నారు. దేశ చరిత్రలో ఇది సువర్ణాధ్యాయమని చెప్పారు.

కుటుంబాల్లో ఆనందం

సంక్షేమ పథకాల వల్ల ఎంతమేర లబ్ధి చేకూరిందో చెబుతున్న సమయంలో ప్రతి కుటుంబం ఎంతో ఆనందంగా కనిపించిందని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినిధులుగా మేం మీ ముందుకు వచ్చామని చెప్పగా పథకాలు అందుతున్నాయని ప్రతి లబ్ధిదారు సంతోషంగా చెప్పారన్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు మహిళలు, వృద్ధులు పెద్దఎత్తున హారతులు పట్టి ఆశీర్వదిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకుంటామని అనేకమంది చెప్పారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జునరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, కోవూరు సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సభ్యులు, తురక భాస్కర్, అనూప్‌రెడ్డి, ప్రసాద్, చిరంజీవి, మల్లికార్జున, శీను, సాయికుమార్, నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలో నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పొదలకూరు, తోటపల్లిగూడూరు మండలాలకు చెందిన గిరిజన హౌసింగ్ లబ్ధిదారులకు రూ.15 వేల ఆర్థిక సహాయం చెక్కులను శుక్రవారం సాయంత్రం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ నిరుపేదలు జగనన్న ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ సహాయంతోపాటు మరింత తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. అదనంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా కాంట్రాక్టర్లను నియమించి ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో సుమారు 4,500 ఎస్టీ కుటుంబాలకు నగదు అందజేసి ఇళ్లు కట్టించి ఇవ్వడం తన ప్రధాన బాధ్యతగా మంత్రి పేర్కొన్నారు. గిరిజనులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొదలకూరు, తోటపల్లిగూడూరు మండలాలకు చెందిన 82 మంది గిరిజనులకు రూ.12.30 లక్షలను మంత్రి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో డీఈ బీవీ సత్యనారాయణరావు, ఏఈలు ముష్తార్‌బాషా, ఎం.శివమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్



మాట్లాడుతున్న విజయకుమార్

పొదలకూరు: ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణేతలని, మిగిలిన వారంతా వారి సేవకులని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ అన్నారు. ఐక్యతా విజయపథం యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన పొదలకూరు పంచాయతీ బస్టాండ్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల్లో ప్రజాచైతన్యం తీసుకొచ్చేందుకే తాను యాత్రను చేపట్టినట్లు పేర్కొన్నారు. పొదలకూరులో తొలిసారిగా సిండికేట్ బ్యాంకు ఉద్యోగిగా మూడునెలలు పని చేశానని తెలిపారు. నెల్లూరు జిల్లాలో అత్యధిక కాలం జిల్లాస్థాయి అధికారిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. పొదుపు మహిళల్లో పెనుమార్పులు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం బస్టాండ్ నుంచి గేటుసెంటర్ వరకు విజయకుమార్ ర్యాలీ నిర్వహించారు.

అద్దాల మండపం ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన పోట్ల దశరథరామయ్య – యానాదమ్మ దంపతులు ఈ మండపాన్ని కట్టించారన్నారు. ఈ సందర్భంగా దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి పెద్దపీట



తీర్మానాలను ప్రవేశపెడుతున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో ఎన్నో పనులు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో 33 తీర్మానాలను ప్రవేశపెట్టగా అందులో 32 తీర్మానాలను కౌన్సిలర్లు ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

- నెల్లూరు ఆర్డీఓ మలోల



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పొదలకూరు: గ్రామ సచివాలయ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు ఆర్డీఓ ఎ.మలోల అన్నారు. మండలంలోని ప్రభగిరిపట్నం సచివాలయాన్ని ఆర్డీఓ శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డులను పరిశీలిస్తే గ్రామస్తులకు తక్కువ సేవలు అందించినట్లుగా ఉందన్నారు. వందల సంఖ్యలో సచివాలయంలో సేవలు అందిస్తున్నామని ఇక్కడ మాత్రం ప్రజలు కోరిన సేవలు తక్కువగా ఉన్నట్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందువల్ల గ్రామస్తులు సేవలు వినియోగించుకోవడం లేదో తెలుసుకోవాల్సిందిగా సూచించారు. రికార్డులను పక్కాగా నిర్వహించడంతోపాటు, ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. అంతకుముందు ఆర్డీఓ అమ్మవారిపాళెం, ప్రభగిరిపట్నం గ్రామాలు ఒకే రెవెన్యూ విలేజ్ కింద ఉండడం వల్ల చెరువుల భాగ పంపకాల్లో వివాదాలు తలెత్తాయి. దీంతో రెవెన్యూ విలేజ్ పరిధిలో ఉన్న మూడు చెరువులను ఆయన పరిశీలించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ కె.వీరవసంతరావు, మండల సర్వేయర్ ఎల్.వెంకటేశ్వర్లు ఉన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

కొడవలూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన శనివారం జరుగుతుందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న సివిల్ జడ్జి లక్ష్మీనారాయణ

కొడవలూరు: విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక స్పృహ చాలా అవసరమని కోవూరు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య వక్తగా వచ్చిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువెంత ముఖ్యమో సమాజం పట్ల అవగాహన కలిగి ఉండడం అంతే అవసరమన్నారు. ఎదుటి వ్యక్తులను బాధ పెట్టి ఆనందం పొందడం పైశాచికత్వమన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. వెంకటేశ్వర కళాశాల ర్యాగింగ్ ఫ్రీ కళాశాలగా పేరు సాధించడంలో విద్యార్థుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనిల్ కుమార్, ఎస్సై జి.సుబ్బారావు, మండల లీగల్ సెల్ అథారిటీ సభ్యులు వి.రాంబాబు, ఏజీపీ ఎం.మల్లికార్జునబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ వంశీధర్‌రెడ్డి, కార్యక్రమ కో–ఆర్డినేటర్ వి.రవికుమార్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు



ఇందుకూరుపేట: గాజుల అలంకారంలో అమ్మవారు



పొదలకూరు : వరలక్ష్మి అమ్మవారు

ఇందుకూరుపేట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నం చాముండేశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం గాజుల అలంకరణ చేపట్టారు. వివిధ రంగుల గాజులతో అమ్మవారి మూలవిరాట్, ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు అనిల్ స్వామి, రామకృష్ణ స్వామి, కిశోర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిపారు. గాజుల అలంకారానికి ఉభయదాతలుగా ప్రవాస భారతీయులు గంటా సన్యాసరావు, స్వర్ణలత దంపతులు వ్యవహరించారు.

- **పొదలకూరు:** శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మి అమ్మవారికి డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా అన్నం లక్ష్మీనారాయణ – లక్ష్మి దంపతులు వ్యవహరించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మనుబోలులో..

- **మనుబోలు:** స్థానిక విష్ణాలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు హనుమాచార్యులు వేకువజామున పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. కార్యక్రమానికి కుడుమల వెంకటరమణయ్య ఉభయకర్తగా వ్యవహరించారు.

మూడు పూరిళ్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని మలిదేవి డ్రెయిన్ సమీపంలో ఉన్న పూరిళ్లలో శుక్రవారం ఉదయం మూడు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఒక్కసారిగా ఇళ్ల నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఓ ఇంట్లో దుస్తులు, స్టౌ, వంట పాత్రలు కాలిపోయాయి. మిగిలిన రెండు ఇళ్లలో ఎలాంటి వస్తువుల్లేవు. ఇక్కడి గిరిజనులు ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వలస వెళ్లడంతో స్థానికులు మంటలను ఆలస్యంగా గుర్తించారు.

ఎల్లో మీడియా అబద్ధాలు

దీనిపై ఎల్లో మీడియా రాద్ధాంతం చేసింది. ఈ ప్రమాదానికి వైఎస్సార్‌సీపీ నేతలే కారణమని అబద్ధాల ప్రచారానికి పూనుకుంది. అసలు ఆ మూడు పూరిళ్లు ఎలా కాలిపోయాయో అని అధికారులు తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. అయితే ఎల్లో మీడియా మాత్రం వైఎస్సార్‌సీపీ నేతలే నిప్పు పెట్టారని అవాస్తవాలను ప్రచారం చేసింది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మనుబోలు: మనుబోలు అంబేడ్కర్ నగర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పొదలకూరు రూరల్ సీఐ సంగమేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. మనుబోలు, మడమనూరు, బండేపల్లి గ్రామాల్లో మూడు వార్డులకు శనివారం ఉప ఎన్నికలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో మనుబోలు 4వ వార్డుకు ఎన్నిక జరిగే దళితవాడ ప్రాథమిక పాఠశాల పోలింగ్ స్టేషన్‌లో వసతులను సీఐ పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పోటీలో ఉన్న అభ్యర్థులు పరిమళ ఆదిలక్ష్మికి ప్రెషర్ కుక్కర్, చింతల శేషమ్మకు గొను గుర్తులను ఎన్నికల అధికారులు కేటాయించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలవుతుందని పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. సీఐ వెంట ఎస్సై అజయ్‌కుమార్ ఉన్నారు.

పక్కాగృహాల ప్రారంభానికి చర్యలు

- హౌసింగ్ జిల్లా ప్రత్యేకాధికారి శివప్రసాద్



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న శివప్రసాద్

వెంకటాచలం: జగనన్న కాలనీల్లో అన్ని వసతులతో పక్కాగృహాల ప్రారంభానికి చర్యలు చేపడుతున్నామని హౌసింగ్ జిల్లా ప్రత్యేకాధికారి శివప్రసాద్ అన్నారు. వెంకటాచలంలో ఇళ్ల నిర్మాణం, కాలనీ ఎంట్రన్స్‌లో ఆర్చి నిర్మాణ పనులను శుక్రవారం హౌసింగ్ జిల్లా ప్రత్యేకాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాచలంలోని జగనన్న కాలనీల్లో వంద ఇళ్లు త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాలనీలో తాగునీటి కుళాయిలు, విద్యుత్, రోడ్లు, సైడు కాల్వలు, ఇతర వసతులు కల్పించడం జరుగుందన్నారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ నాగరాజు, డీఈ సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటరమేష్, ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: కోవూరు యర్రబాక కృష్ణారెడ్డి కౌసల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కాలేజీలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన లైబ్రరీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి లైబ్రరీని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నాడు – నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కళాశాల గేటు నుంచి తరగతి గదుల వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే విద్యార్థినుల భద్రత కోసం నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. లైబరీలో ఏసీలను పెట్టించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తి బాధ్యత ట్రస్ట్ తరఫున తామే తీసుకుంటామన్నారు. అనంతరం లైబ్రరీ నిర్మాణానికి కృషి చేసిన వారిని జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.ప్రసన్నలక్ష్మి, లైబ్రేరియన్ డాక్టర్ కె.ప్రభాకర్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు మహా పాదయాత్ర నేడు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి శనివారం ఉదయం తిరుమలకు మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆ దేవస్థానం నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్రలో పాల్గొనాలకునే భక్తులు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో తమను సంప్రదించాలన్నారు. మూడురోజులపాటు టిఫిన్, భోజన సదుపాయం కల్పిస్తామని, నడవలేని భక్తులకు బస్సు, వ్యాన్ సౌకర్యం కూడా ఉన్నట్లు తెలియజేశారు. వివరాలకు శివాడ పరంధామిరెడ్డి 94408 25110, దాసరి సురేంద్రబాబు 85004 99568 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సీహెచ్‌సీలో అన్ని రకాల శస్త్రచికిత్సలు



డాక్టర్ ప్రసాద్

పొదలకూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరలో అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తామని వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ తెలిపారు. సీహెచ్‌సీలో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. మరో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసి త్వరలో శస్త్రచికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అయితే రోగి సాధారణ పరిస్థితిలో ఉంటేనే ఆపరేషన్ చేస్తామన్నారు. లేకుంటే జీజీహెచ్‌కు రెఫర్ చేస్తామని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రతి సోమవారం రెండు నుంచి మూడు చేస్తున్నామన్నారు. ప్రతినెలా కాన్పులు జరుగుతున్నాయని, ఈనెల 16 చేసినట్లు తెలిపారు. ఓపీ పెరిగిందని, ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంక్ ఉన్నందున అత్యవసర కేసులను కూడా చూస్తున్నట్లు చెప్పారు. నాలుగు మండలాలకు కేంద్రంగా సీహెచ్‌సీ ఉన్నందున ఇక్కడ పోస్టుమార్టం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అదనపు పీహెచ్‌సీకు ఇక్కడే ఒక గదిని కేటాయించామని అయితే పీహెచ్‌సీ వైద్యులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంటారని తెలిపారు. ప్రతినిత్యం రాత్రివేళల్లో ఒక డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉంటారని, మందుల కొరత లేదన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు



శబరిమలలో చలపతిరావు, నాయకులు

కొడవలూరు: డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం శబరిమలలో అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం విజయవంతమైనందుకు స్వామికి మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరిగి ఘన విజయం సాధించాలని, ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందాలని ప్రత్యేక పూజలు చేయించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహన్‌కృష్ణ, కొండా శ్రీనివాసులురెడ్డి, తాటిపర్తి భాస్కర్, చిమటా శేషగిరి, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.